క్లుప్తంగా

మరుపల్లిలో ఫాగింగ్



మరుపల్లి గ్రామంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామంలో దోమల నివారణకు పారిశుధ్య సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఫాగింగ్ చేశారు. ఇటీవల దోమల కారణంగా గ్రామస్తులు జ్వరపీడితులు కావడంతో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టినట్టు సర్పంచ్ రామలక్ష్మి తెలిపారు.

విద్యార్థులకు వాటర్‌బాటిళ్ల పంపిణీ



సర్పంచ్ అందజేసిన వాటర్‌బాటిళ్లతో విద్యార్థులు

వేపాడ: మండలంలోని చినగుడిపాల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను శుక్రవారం అందజేశారు. పాఠశాలకు చెందిన 30 మందికి వేసవిలో దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడే విధంగా స్టీల్ బాటిల్స్‌ను అందజేశారు. సర్పంచ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లండ లక్ష్మి, గ్రామపెద్ద వేచలపు రామకృష్ణ, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, శివలక్ష్మి పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి మోటారుకు మరమ్మతులు



మోటారు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామ పంచాయతీలో రక్షిత తాగునీటికి సబంధించిన మెటారు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆర్.రాముతో పాటు ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. మోటారుకు మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు తాగునీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎం, ప్రిన్సిపాల్

శృంగవరపుకోట : రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపో మేనేజర్ కె.రమేష్, స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావుల నేతృత్వంలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, డిపో మేనేజర్ కె.రమేష్, సూపరింటెండెంట్ వెంకటరావు, కళాశాల లెక్చరర్లు భాస్కరరావు, వాసుదేవరావు, వీరన్న, సుధీర్ తదితరులు రహదారి భద్రతపై మాట్లాడారు. రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఇదే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సీసీ తీరుపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న పొదుపు సంఘం మహిళలు

శృంగవరపుకోట : మహిళా సంఘానికి రుణం కావాలంటే మహిళా మార్ట్‌లో సామాన్లు కొనాలని, రూ.500లు సామాన్లు కొనలేని మీరు రూ.5లక్షల రుణం ఎలా చెల్లిస్తారంటూ సీసీ మంగమ్మ తమను అవహేళన చేశారని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన ప్రగతి మహిళా పొదుపు సంఘం సభ్యులు శుక్రవారం ఎంపీడీఓ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రుణం తీసుకోటానికి సీసీ మంగమ్మను కలిస్తే మహిళా మార్ట్‌లో రూ.5000లు సామాన్లు కొంటే లోన్ శాంక్షన్ చేస్తానని చెప్పారన్నారు. సభ్యులు మార్ట్‌కు వెళ్లి సరుకులు తీసుకుని తిరిగి వెళ్లి సీసీని కలిస్తే గ్రూపులో అందరూ రూ.500లు చొప్పున సామాన్లు కొంటేనే లోన్ శాంక్షన్ చేస్తామని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా అటూ ఇటూ ఆరుసార్లు తిప్పి తమకు ఏమీ చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులను అవమానించడం సరికాదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఓ పద్మ

కొత్తవలస : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నట్టు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారిణి పప్పు పద్మ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ సహాయకులతో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ పద్మ మాట్లాడుతూ నూతనంగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్టు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు కచ్చితంగా వ్యవసాయ బోరు లేదా బావి ఉండాలన్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు ఏడాదికి రూ.5,250 నిర్వహణ ఖర్చుల కింద ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అలాగే అంతర పంటల సాగుకు హెక్టార్‌కు రూ.5వేలు చెల్లిస్తుందన్నారు. మైక్రో ఇరిగేషన్ పథకంలో ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు తుంపర లేదా బిందు పరికరాలకు 90 శాతం రాయితీపై ఇస్తున్నట్టు తెలిపారు. ఐదెకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్టు తెలిపారు. లక్కవరపుకోట, కొత్తవలస మండలాల్లో ఆయిల్‌పామ్ పెంపకంపై శ్రీనివాస ఆయిల్ మిల్లుకు ప్రభుత్వం అప్పజెప్పిందన్నారు. కంపెనీవారు వంద శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు అందజేస్తారని తెలిపారు. పంట దిగుబడి సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కంపెనీ వారు పంటను కొనుగోలు చేస్తారన్నారు. గ్రామాల్లో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ఆయిల్‌పామ్ తోటలు పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఏఓ మాధురిశరణ్య, ఈఓ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

గంట్యాడ: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ఈ నెల 10వ తేదీన వేయాలని ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు, సీడీపీఓలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలలు, నాలుగు ప్రైవేటు పాఠశాలలు, 96 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం భోజనాలు చేసిన అర్ధ గంట తరువాత మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ సచివాలయానికి ఒక మండల స్థాయి అధికారిని నియమించనున్నట్టు తెలిపారు. గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, సీడీపీఓ డి.ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం



చింతలపేట నీలకంఠేశ్వర స్వామి ఆలయం

గుర్ల: మండలంలోని చింతలపేటలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శనివారం నుంచి సోమవారం జరగనున్నట్టు ఆలయ పూజారి నాగ రామలింగేశ్వర శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు పతివాడ భాస్కరరావు తెలిపారు. పూజల్లో భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి చర్యలు



వనమిత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ కొండలరావు

• డీఎఫ్‌ఓ కొండలరావు

బొండపల్లి: జిల్లాలో గల వనమిత్ర కేంద్రాలు అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్‌ఓ ఆర్.కొండలరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గల వనమిత్ర కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వనమిత్ర కేంద్రంలో నర్సరీల్లో పెంపకం చేపడుతున్న వివిధ రకాలైన మొక్కలను, వనమిత్ర కేంద్రం పరిసరాలను పరిశీలించారు. కేంద్రాల అభివృద్ధికి కావాల్సిన వనరులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. వనమిత్ర కేంద్రాల్లో ఉపాధి నిధులతో వివిధ రకాలైన మొక్కలను పెంపకం చేపట్టి వాటిని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లుకు ఇరువైపులా పెద్ద ఎత్తున నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వనమిత్ర కేంద్రాలను టూరిజం పార్కులుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ సింధు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు ప్రసాద్, వనమిత్ర కేంద్రం సహాయకుడు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కర్లాంలో 24 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో ఏటా వలే ఈ నెల 24 నుంచి 26వ తేదీవరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉమామల్లిఖార్జున స్వామి 126వ కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 26న మధ్యాహ్నం 12 గంటలకు లింగోద్భవ మహోత్సవం, రాత్రి 8 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రసాద వితరణ చేస్తామన్నారు.

విద్యా హక్కుల ఉల్లంఘన సరికాదు

శృంగవరపుకోట: విద్యా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ బలవంతపు టీసీలతో భయపెడుతున్న నారాయణ కేంబ్రిడ్జ్ స్కూల్‌పై చర్యలు తీసుకోకుండా మండల విద్యాశాఖ చేష్టలుడిగి చూస్తోందని సామాజిక కార్యకర్త, న్యాయవాది బి.రామకృష్ణ ఆరోపించారు. నాలుగేళ్లుగా నారాయణ కేంబ్రిడ్జ్ స్కూల్‌గా చలామణి అవుతూ గుర్తిరపు లేకుండా నడుస్తున్న పాఠశాల యాజమాన్యం ఇప్పుడు తల్లిదండ్రులకు ఇతర శాఖలు బదిలీ కావాలనుకునే వారు ఫీజులు చెల్లించాలని, ఈ నెల 10వ తేదీ లోగానే టీసీకి, దరఖాస్తు చేసుకోవాలని, 10తేదీ తర్వాత దరఖాస్తు చేస్తే వారు 2025–26 సంవత్సరపు తొలి టెర్మ్ ఫీజు చెల్లించాలని, సర్క్యులర్ పంపినట్టు రామకృష్ణ చెప్పారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థి టీసీ కోసం ఎప్పుడైనా రఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న వారంలోగా పాఠశాల యాజమాన్యం టీసీ ఇవ్వాలని విద్యాహక్కు చట్టం స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసే ఈ తరహా చర్యలపై విద్యాశాఖ ఇకనైనా కళ్లు తెరవాలని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరు నెలలుగా శుభ్రపరచని వాటర్‌ట్యాంక్



మంచినీటి ట్యాంక్ పైకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పెరిగిపోయిన ఎదురు పొదలు

లక్కవరపుకోట : మండలంలోని చందులూరు పంచాయతీ రొంగళవానిపాలెం గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంక్‌ను గడిచిన ఆరు నెలలుగా శుభ్రపరచలేదని గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామంలో 5వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంక్ ఉండగా.. దీన్ని అనుకొని దట్టంగా ఎదురు పొదలు పెరిగిపోయాయి. ట్యాంక్‌పైకి వెళ్లే మెట్లను పూర్తిగా కప్పేశాయి. దీంతో ట్యాంక్ పైకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. రక్షిత మంచినీటి అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంక్ నుంచి చెత్త చెదారం వంటి నీరు వస్తోందని తాగేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎదురుపొదలను తొలిగించి ట్యాంక్‌ను శుభ్రపరచాలని కోరుతున్నారు.

అతి వేగం ప్రమాదకరం



ప్లకార్డులతో రోడ్డు నిబంధనలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): అతివేగం ప్రమాదకరమని విజయనగరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర్‌ప్రసాద్ అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, విశ్రాంతి లేకుండా వాహనం నడపడం, రోడ్డు, వాహనాల కండీషన్లు సక్రమంగా లేకపోవటం కారణంగా 80 శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

వాహనం డ్రైవ్ చేసే ముందు కుటుంబం తనపై ఆధారపడి ఉందని ఆలోచించాలని సూచించారు. రోడ్డు ప్రమాద దృశ్యాల వీడియోను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.జాషువాజయప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనీల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.శివ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి పంట తెగుళ్లను పరిశీలించి అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రస్తుతం కురుస్తున్న మంచు ప్రభావంతో పురుగు, తెగుళ్ల వ్యాప్తి నుంచి మామిడి పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామంలో మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మామిడి ఆరంభంలో పూత, పిందె దశను కాపాడుకుంటే ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. మామిడి రైతులకు అందజేసే రాయితీలు, గొడౌన్, కోల్డ్‌స్టోరేజీ పథకాలు, ఏపీఎంఐపీ పథకాలపై అవగాహన కల్పించారు.

బాలుర హైస్కూల్‌ను సందర్శించిన ఏపీసీ



ప్రభుత్వ బాలుర హైస్కూల్‌ను సందర్శించిన ఏపీసీ రామారావు

గజపతినగరం : విజయనగరం జిల్లా సర్వశిక్ష అభియాన్ ఏపీసీ(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్) ఎ.రామారావు గజపతినగరం బాలుర హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. 10వ తరగతి 1999వ సంవత్సరంలో ఇక్కడే చదివి 10వ తరగతి ఉత్తీర్ణులైనట్టు విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఎ గ్రేడు స్థాయికి తీసుకు రావాలని సూచించారు. ఇటువంటి మంచి వాతావరణాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్, హెచ్ఎం బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

• మైదానం కాదు.. చెరువే..



కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామంలోని చెరువు క్రీడా మైదానాన్ని తలపిస్తోంది. చెరువులోని నీటిపై పూర్తిగా పచ్చగా నాచు కప్పేయడంతో క్రీడా మైదానంలా కనిపిస్తోంది. దీన్ని చూసి అటుగా వెళ్లే వారు ఒకింత ఆశ్చర్యపోతున్నారు. – కొత్తవలస

• పుణ్యగిరి జాతరపై సమీక్ష



'కోట'లో జరగనున్న రెండు రోజుల పుణ్యగిరి జాతర ఏర్పాట్లుపై సమీక్షించేందుకు ముందస్తు సమావేశాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పుణ్యగిరి జాతర ఏర్పాట్లను సమీక్షించేందుకు వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని తహసీల్దార్ అరుణకుమారి నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జాతరకు కావాల్సిన ఏర్పాట్లుపై చర్చించారు. – శృంగవరపుకోట

• అలరించిన మహిళల కోలాటం



ఎస్.కోట మండలంలోని వేములాపల్లి పంచాయతీ గత్రాజుకళ్లాల్లో శుక్రవారం సన్యాసమ్మ పేరంటాలు తీర్థం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఏర్పాటు చేసిన సంబరాలను గ్రామ పెద్దలు, యువత సందడిగా జరిపారు. ఈ సందర్భంగా కోలాటం, బుర్రకథల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో కొత్తవలస, జామి, గోపాలపల్లి జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. – శృంగవరపుకోట

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

కొత్తవలస : మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కోటంశెట్టి వెంకటరావును ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎంపీడీఓ ఎస్.రమణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎల్.చిన్నారావు, సేక్ షహనాజ్, కోశాధికారిగా ఉరిటి మాధవీలత, కార్యవర్గ సభ్యులుగా గనివాడ పద్మావతి, కె.దీపిక, ఎం.జయకుమారి, రంభ అప్పారావు, వర్రి రాము, వి.కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులకు ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ శ్రీదేవిలు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా షిర్డిసాయి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



షిర్డిసాయి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు



మాజీ ఎంపీ బెల్లానకు ఆశీర్వచనం అందజేస్తున్న పండితులు

చీపురుపల్లి: పట్టణంలోని సంగువారిమెట్టకాలనీలో శ్రీ షిర్డిసాయి బాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ నెల 5 నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆఖరిరోజు శుక్రవారం మందిర వ్యవస్థాపకులు గవిడి నాగరాజు, సత్యవాణి దంపతులు ఆధ్వర్యంలో వేదపండితులు మహామిడి మురళీశర్మ ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. షిర్డిసాయి దర్శనానికి వచ్చిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఆశీర్వాదం అందజేశారు.

రుణాలు రికవరీ జరిగేలా చూడండి

గజపతినగరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళ సంఘాల అధ్యక్షులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకోవాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రకాల రుణాలు వంద శాతం రికవరీ జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం ఎల్.సత్యనారాయణ, ఎస్‌వీఈపీ ఇందిర, సీసీలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



ఎస్.కె.ఎస్.ఆర్.పురంలో విద్యార్థులకు గణితం బోధిస్తున్న ఎంఈఓ

వేపాడ: మండలంలో ఎస్.కె.ఎస్.ఆర్.పురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ–1 నాగభూషణం విద్యార్థులకు గణితంలో తీసివేతలు, కూడికలపై బోధించారు. సబ్జెక్టు వారి వర్కుబుక్స్‌ను పరిశీలించి దస్తూరీ మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం బంగారయ్యపేట, రామస్వామిపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూ పరిశీలించిన నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఎంఈఓ–2 బాల భాస్కరరావు పెదగుడిపాల పాఠశాలను సందర్శించి తరగతి గదులను కిచెన్‌గార్డెన్స్ టాయిలెట్స్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.